క్లుప్తంగా

ఘనంగా బతుకమ్మ వేడుక


సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

మీర్‌పేట: మీర్‌పేట నారాయణ ఐఐటీ ఒలింపియాడ్ పాఠశాలలో బుధవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబ్జీ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. పూలను పూజించే గొప్ప సంస్కృతి మన తెలంగాణలోనే ఉందన్నారు. సంప్రదాయాలు, ఆచారాలను చాటిచెప్పే పండుగ బతుకమ్మ అని తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఈ ఛాంప్స్ సీఓ వాణి, ఏఓ మాధవి, ఏడీ రాజేందర్, వీపీలు ధరణీ, ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక


బీజేపీలో చేరుతున్న జేఎస్‌ఎస్‌యూఆర్‌ఎం వాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 10వ డివిజన్ కుర్మల్‌గూడలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం గృహ సముదాయాల నుంచి పలువురు బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి అందెల ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దశాబ్ద కాలంలో ఏ ఒక్క నోటిఫికేషన్ వేయలేదన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి, భృతి కల్పిస్తామన్నారు. నియోజకవర్గం పరిధిలో డబుల్ బెడ్రూం జాడే లేదని ఆరోపించారు. మహేశ్వరంలో కాషాయ జెండా ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, భాస్కర్, భాస్కర్‌యాదవ్, శ్రీను తదితరులున్నారు.

ఇంటి పన్నులు తగ్గిస్తాం

అందెల శ్రీరాములు యాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములుయాదవ్

మీర్‌పేట: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మీర్‌పేట కార్పొరేషన్‌లోని అధిక ఇంటి పన్నులను తగ్గిస్తామని మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. బుధవారం మీర్‌పేట కార్పొరేషన్ గాయత్రినగర్‌లో పర్యటించి, కాలనీవాసులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడుతూ.. ప్రజల ముక్కుపిండి అధిక ఇంటి పన్నులు, నల్లా బిల్లులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగ భృతి, దళితబంధు, బీసీబంధు ఇవ్వకుండా అన్ని వర్గాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సబిత, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు జగన్, మహేష్, రఘు, కసిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

కుంగిన రోడ్డు.. రాకపోకలకు ఇక్కట్లు


చైతన్యపురి చౌరస్తాలో జాతీయ రహదారిపై పడ్డ గొయ్యి

చైతన్యపురి: కొత్తపేట చౌరస్తా నుంచి దిల్‌సుఖ్‌నగర్ వెళ్లే జాతీయ రహదారి చైతన్యపురి జంక్షన్ వద్ద రోడ్డు కుంగిపోయి పెద్ద గొయ్యి ఏర్పడింది. బుధవారం ఉదయం రోడ్డు మధ్యలో రెండు అడుగుల వెడల్పు, నాలుగు అడుగుల లోతులో గుంత పడింది. ఇది గమనించి బారికేడ్లు అడ్డుగా పెట్టడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ అధికంగా ఉండే ప్రాంతంలో గొయ్యి ఏర్పడటంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారికి మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కొనసాగుతున్న తనిఖీలు

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం పోలీసులు బుధవారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో మాల్ కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అక్రమంగా డబ్బు తరలింపుపై తనిఖీలు చేపడుతున్నారు. గునుగల్ గేట్, యాచారం పోలీస్ స్టేషన్ ముందు కూడా పోలీసులు తనిఖీలు చేపట్టారు.

ఏళ్ల నిరీక్షణకు తెర

- ఓపెన్, గ్రీన్ జోన్ల ఎత్తివేత
- కాలనీల్లో సంబురాలు
- మంత్రి సబితారెడ్డికి కృతజ్ఞతలు, క్షీరాభిషేకాలు


జీఓను చూపెడుతున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: 20 ఏళ్ల నిరీక్షణ.. నేడు ఫలించింది.. ఎవరో చేసిన చిన్న తప్పిదాలకు వేలాది కుటుంబాలు సమస్యల్లో చిక్కుకున్నారు. ఇళ్లు కట్టుకోవడానికి పర్మిషన్లు ఇవ్వకుండా కడుతున్న ఇండ్లను నేలమట్టం చేయడం, లక్షలు పోసి కొనుకున్న స్థలం దేనికి పనికిరాకుండా పోయిందని కొనుగోలుదారుల మానసిక ఆవేదన.. వెరసి ఓపెన్, గ్రీన్‌జోన్ల నుంచి రెసిరెన్సియల్ జోన్లుగా మార్పులు చేసి జీఓ విడుదల చేయడంతో 20 పైగా కాలనీల్లో ఆనందాలు వెల్లువిరుస్తున్నాయి. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని 148,149లోని సర్వేనంబర్లలో 27 ఎకరాల్లో నివాసాలు ఏర్పరుచుకున్న వారు అలాగే అల్మాస్‌గూడలోని 121, 122, 123, 124, 129 సర్వే నంబర్లలోని 52 ఎకరాలు మొత్తంగా 80 ఎకరాల్లో గతంలో లేఅవుట్ చేసి వెంచర్లు నిర్వహించారు. 1982లో హెచ్‌ఎండీఏ ఏర్పడినప్పుడు ఈ ప్రైవేట్ భూములను ఓపెన్, గ్రీన్ జోన్ కింద చేర్చారు. అప్పటి నుంచి కాలనీవాసులు కాళ్లు అరిగేలా అధికారుల చుట్టూ తిరిగి వేసారి పోయారు. అసెంబ్లీ తీర్మానం చేస్తే తప్పా వేరే మార్గం లేదని, ఫిర్యాదులను స్వీకరించలేదని బాధితులు చెప్పుకొచ్చారు. ఓపెన్‌జోన్ ఎత్తివేయిస్తానని మంత్రి సబితారెడ్డి మాట ఇచ్చారు. ఇచ్చినా మాట ప్రకారం ఓపెన్, గ్రీన్ జోన్‌ను ఎత్తివేసి, రెసిడెన్సియల్ జోన్‌గా మార్పుచేశారు. దీంతో గ్రీన్ జోన్, ఓపెన్ జోన్‌ల్లో ఇళ్లు కట్టుకున్న వారు సంబరాలు చేసుకుంటున్నారు. అల్మాస్‌గూడలో సుమారు 12కు పైగా కాలనీలు, బడంగ్‌పేటలోని 9కి పైగా కాలనీలు ఆనందంలో మునిగితేలుతున్నారు.

మాట నిలబెట్టుకున్నారు



ఓపెన్ జోన్, గ్రీన్ జోన్‌ను ఎత్తి వేయిస్తానని నాడు మాట ఇచ్చారు. కానీ ఎత్తి వేయడం అంత సులువు కాదని తెలిసింది. అయినా పట్టువదలని విక్రమార్కుని వల్లే సీఎంతో, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లి అధికారులను కలెక్టర్లను, హెచ్‌ఎండీఏను ఒప్పించి రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్పు చేయించింది. అందుకు జీవో కూడా ఇప్పించింది. అల్మాస్‌గూడ, బడంగ్‌పేట ఓపెన్, గ్రీన్‌జోన్‌లోని ప్రజలు సబితారెడ్డి చేసిన మేలు మరవొద్దని తెలిపారు.

–భీమిడి స్వప్న, కార్పొరేటర్

నాడు బ్యాంక్ మేనేజర్‌గా లోన్లు ఇవ్వలేకపోయా?



నేను బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్నప్పుడు ఓపెన్ జోన్‌లో జాగాలు తీసుకున్న వారు హోమ్‌లోన్ల కోసం వచ్చేవారు. ఓపెన్ జోన్, గ్రీన్ జోన్ కింద ఉండటంతో ఆ ఫైళ్లన్నీ తిరస్కరించేవాడిని. ఏ బ్యాంకులు లోన్లు ఇచ్చేవారు కాదు. ఇందులో తెలియక ప్లాట్లు కొనుక్కున్నవారు చాలా బాధపడేవాళ్లు. 20 ఏళ్లుగా వారి బాధలు దగ్గరుండి చూస్తూ వస్తున్నాను. ఓపెన్, గ్రీన్ జోన్లు ఎత్తివేసి వందలాది ఇంటి యజమానులకు తీపి కబురు అందించారు.

– డానియల్, రోమా–2 కాలనీ

నిన్ను నువ్వే బాగు చేసుకోవాలి

ఉమెన్ సేఫ్టీవింగ్ డీఐజీ సుమతి


ఐపీఎస్ సుమతికి జ్ఞాపిక బహూకరిస్తున్న జగన్మోహన్‌రెడ్డి

బడంగ్‌పేట్: నిన్ను నువ్వే బాగుచేసుకొని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని తెలంగాణ ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ బడుగుల సుమతి సూచించారు. బుధవారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐపీఎస్ అధికారి సుమతి హాజరై మాట్లాడారు. నీ భవితను నీవే నిర్ణయించుకొని బాగుచేసుకోవాలన్నారు. మొబైల్ వాడటం ఎలా కంట్రోల్ చేయాలి? ఆన్‌లైన్ సైట్‌లో మోసపోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థినులకు వివరించారు. దురాలవాట్లకు ఎలా దూరంగా ఉండాలో, ఉద్యోగాలు చేస్తున్నప్పుడు వచ్చే సమస్యలను ఎలా అధిగమించాలో పవర్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మానసిక బలం, నిజాయితీలను ఆయుధంగా వాడాలన్నారు. అవసరమైనప్పుడు కమ్యూనికేషన్ వ్యవస్థను సమర్థవంతంగా వాడాలని హితవు పలికారు. ఉమెన్ సేఫ్టీ ఇంటర్న్‌షిప్‌లకు పోలీస్ డిపార్ట్‌మెంట్ ద్వారా పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన కొన్ని రహస్య మెలుకువలు తెలియజేశారు. అనంతరం సుమతిని కాలేజీ యాజమాన్యం జ్ఞాపిక సన్మానించారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీ సెక్రటరీ ఎస్. జగన్మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పి.వెంకటకృష్ణ, గాయత్రి పావని, ఆధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్


రంగులు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

తుక్కుగూడ : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అమలులో ఉన్న కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ హెచ్చరించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో గల రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, జెండాలు, బ్యానర్‌లు, గోడలపై రాతలు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత మూడు రోజుల నుంచి శ్రీశైలం జాతీయ రహదారితో పాటు, గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద రాజకీయ నాయకుల విగ్రహాలు, పార్టీ దిమ్మెలకు ముసుగులు వేశామన్నారు. ఎన్నికల కోడ్ అమలకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటేశ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


అంత్యక్రియల్లో పాల్గొన్న కార్తీక్‌రెడ్డి తదితరులు

మహేశ్వరం: పెండ్యాల మాజీ సర్పంచ్ కేశే. జైత్వారం సాయిరెడ్డి సతీమణి ముకుందమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం గ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో బీఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకులు పి. కార్తీక్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిలు హాజరై భౌతికాయానికి నివాళులర్పించారు. వారి కుమారులు జగన్మోహన్‌రెడ్డి, ప్రహ్లాద్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డిలను వారు పరామర్శించి ఓదార్చి మనోధైర్యం చెప్పారు. సాయిరెడ్డి పెండ్యాల గ్రామానికి పలుమార్లు సర్పంచ్‌గా పనిచేశారని అన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు జైత్వారం హన్మంత్‌రెడ్డి, జైత్వారం జగన్మోహన్‌రెడ్డి, రాజేష్, యాచారం జంగయ్య, యాదయ్య గౌడ్, రవీందర్, వజ్రంరెడ్డి, మంత్రి బాల్‌రాజ్, మంత్రి అంజయ్య, గౌస్, నరేష్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, షరీఫ్, నర్సింహ పలువురు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోండి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ చైతన్యనగర్ కాలనీలోని ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న కమర్షియల్ కాంప్లెక్స్ యజమాని రోడ్డు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారని, వెంటనే ఆక్రమణలను తొలగించాలని చైతన్యనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డిలు ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ రవీందర్ కుమార్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. రాత్రికి రాత్రే కాలనీకి చెందిన గోడను ఆగ్రమించి నిర్మాణాలు చేస్తున్నారని, తాము అడిగితే తమకు అన్ని అనుమతులు ఉన్నాయని చెబుతున్నాడని వారు పేర్కొన్నారు. కాలనీకి వెళ్లే రహదారిని ఆక్రమిస్తే రోడ్డు కుంచించుకుపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని వారు తెలిపారు. గతంలో ఇక్కడ అక్రమంగా భవనాన్ని నిర్మిస్తే జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేశారని, తిరిగి నిర్మాణం చేస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని డీసీని విజ్ఞప్తి చేశారు.

ఆర్థికసాయం

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మంగళపల్లికి చెందిన కొప్పు బుచ్చయ్య ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను బుధవారం మండల వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి భార్య జ్యోతికి వైస్ ఎంపీపీ అనంతరెడ్డి రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మంగళపల్లి ఉపసర్పంచ్ సాయికుమార్, నాయకులు మురళి, గణేశ్ పాల్గొన్నారు.

వర్గీకరణ సాధించేవరకు పోరాటం

యాచారం: ఎస్సీ వర్గీకరణ సాధించేవరకు పోరాటాన్ని ఆపేది లేదని ఎమ్మార్పీఎస్ శ్రేణులు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తలపెట్టిన పాదయాత్ర నవంబర్ 7న హైదరాబాద్ నగరానికి చేరుకుంటున్న దృష్ట్యా జరిగే బహిరంగ సభకు లక్షలాదిగా తరలిరావాలని కోరుతూ బుధవారం ఎమ్మార్పీఎస్ శ్రేణులు యాచారంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండు, ఆనంద్, రాకేష్, యాదయ్య, తరుణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చల్లా పరామర్శ

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామానికి చెందిన మల్లారెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబ సభ్యులను సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో జిల్లాకాంగ్రెస్ నాయకులు భగవాన్‌రెడ్డి, అంజయ్యగుప్తా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, తలకొండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు విఠలయ్యగౌడ్, యాదగిరిరెడ్డి, జనార్ధన్ తదితరులు ఉన్నారు.



కేటీఆర్‌ను కలిసిన నేతలు

ప్రగతిభవన్‌లో ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌ను బుధవారం చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, సరూర్‌నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు పారుపల్లి దయాకర్‌రెడ్డి, మంచినీళ్ల సుదర్శన్‌రెడ్డి ముదిరాజ్, తాటికొండ రాఘవేంద్రగుప్తాలు మర్యాదపూర్వకంగా కలిశారు.

– హుడాకాంప్లెక్స్

సదర్ ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలి

అఖిల భారత యాదవ మహాసభ

సైదాబాద్: దీపావళి పర్వదినం సందర్భంగా సాంప్రదాయబద్ధంగా నిర్వహించే సదర్ ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని అఖిల భారత యాదవ మహాసభ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మైల్‌కోల్ మహేందర్ యాదవ్ కోరారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. సైదాబాద్‌లోని సంఘం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బతుకమ్మ, బోనాల పండుగలను అధికారికంగా నిర్వహించుకుంటున్నామని, అదేవిధంగా సదర్‌కు కూడా గుర్తింపు ఇవ్వాలన్నారు. గతేడాది మన్నెగూడలో నిర్వహించిన యాదవ ఆత్మీయ సమ్మేళన సభలో పాల్గొన్న మంత్రి కేటీఆర్ సదర్ వేడుకలను సైతం అధికారికంగా నిర్వహించుకుందామని ప్రకటించారని గుర్తు చేశారు. సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ నాయకులు శ్రీశైలం, బత్తుల మహేందర్ యాదవ్, వెంకటేష్ యాదవ్, రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.

బీసీలకు ఎక్కువ సీట్లు కేటాయించాలి


సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘాల నాయకులు

బీసీ కులాల సమన్వయ వేదిక డిమాండ్

వనస్థలిపురం: అన్ని పార్టీలు అగ్రకులాలకే అధిక సీట్లు ఇస్తున్నాయని, 60 శాతం జనాభా ఉన్న బీసీలకు దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని బీసీ కుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వనస్థలిపురం కర్నాటి గార్డెన్‌లో తెలంగాణ బీసీ కులాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అన్ని పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని, బీసీలు రాజ్యాధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. 156 బీసీ కులాలు సంఘటితం కావాలన్నారు. ఎల్‌బీనగర్ గడ్డ– బీసీల అడ్డా అని, ఏ పార్టీ బీసీలకు టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటామన్నారు. శ్రీకాంతాచారి బలిదానం వల్లే తెలంగాణ కల సాకారమైందని, బీఆర్‌ఎస్ పార్టీ బీసీలను మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మధుయాష్కి గౌడ్‌కు టికెట్ ఇస్తే మద్దతిస్తామని, బీజేపీ నుంచి కటకం నర్సింగరావుకు టికెట్ ఇవ్వాలని వారు కోరారు. ఏ పార్టీ బీసీలకు టికెట్ ఇవ్వకపోతే బీసీ కులాల సమన్వయ వేదిక నుంచి అభ్యర్థిని నిలబెట్టి గెలిపించుకుంటామన్నారు. బొమ్మ రఘురాం నేత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కొలే జగన్నాథం, చామకూర రాజు, బొంగు వెంకటేష్, వినోద్‌కుమార్, మహేష్‌గౌడ్, కారింగుల నరేందర్‌గౌడ్, ముద్దగౌని సతీష్ గౌడ్, సావిత్రి, శ్రీనివాస్, నర్సింగ్, విజయ్‌కుమార్, యాదగిరి నేత, నగేష్ నేత పాల్గొన్నారు.

బాలికతో అసభ్య ప్రవర్తన.. వ్యక్తికి మూడేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: వాషింగ్ మిషీన్ బింగిచేందుకు వచ్చి బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడికి రంగారెడ్డి జిల్లా మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ పట్టాభి రామారావు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 5 వేలు జరిమానా విధించారు. కోర్టు ఏపీపీ కె.రాజిరెడ్డి కథనం ప్రకారం... మియాపూర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఓ ఫ్లాట్‌లో వాషింగ్ మిషీన్ బింగించేందుకు నిందితుడు షేక్ మౌలాలి వచ్చాడు. ఫ్లాట్‌లో ఎవరూ లేకపోవడంతో అదే ఫ్లాట్‌కు ఆడుకునేందుకు వచ్చిన పక్క బ్లాక్‌కు చెందిన బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. అదే సమయంలో ఫ్లాట్ యజమానురాలు రావడంతో బాలికను వదిలి పెట్టాడు. బాలిక విషయాన్ని తల్లికి చెప్పింది. తల్లి ఫిర్యాదు మేరకు 2019లో మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి బుధవారం నిందితుడికి మూడేళ్ల జైలు, రూ. 5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలు

రంగారెడ్డి కోర్టులు: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.1500ల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా 3వ అదనపు మెట్రోపాలిటన్ కోర్టు మేజిస్ట్రేట్ కొత్త రవి బుధవారం తీర్పు ఇచ్చారు. ఏపీపీ జె.గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. 2020 మార్చి నెలలో నిందితుడు భాస్కర్ రెడ్డికి బాధితురాలితో పెళ్లైంది. ఏడాది పాటు వారి వైవాహిక జీవితం సాఫీగా సాగింది. ఆ తర్వాత ప్రతీ చిన్న విషయానికి భర్త భార్యతో గొడవపడటంతో పాటు అదనపు కట్నం కోసం వేధించేవాడు. వేధింపులు తాళలేక బాధితురాలు 2022 అక్టోబర్‌లో సరూర్‌నగర్ మహిళా పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. సాక్షులను విచారించిన మేజిస్ట్రేట్ నిందితుడికి ఏడాది జైలుశిక్ష, జరిమానా విధిస్తూ బుధవారం తుది తీర్పు వెల్లడించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి


వినతి పత్రం అందజేస్తున్న పాడిరైతులు

కడ్తాల్: పాలశీతలీకరణ కేంద్రం పరిధిలోని పాడి రైతులకు సకాలంలో పాల బిల్లులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే బిల్లులు చెల్లించాలని ఆ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక పాలశీతలీకరణ కేంద్రం మెనేజర్ రాధికను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. కడ్తాల్ పాలశీతలీకరణ కేంద్రం పరిధిలోని వేలాది మంది రైతులు సాగుతో పాటు కుటుంబానికి తోడ్పాటుగా ఉంటుందని పాడిపోషణ చేపట్టి ఉపాధి పొందుతున్నారని తెలిపారు. పాలశీతలీకరణ కేంద్రం పరిధిలో పాడి రైతులకు పాల బిల్లురాక 11 రోజులయిందని.. దీంతో రెక్కాడితే గాని డొక్కాడని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా పాలసేకరణ కేంద్రాల్లో మొబైల్‌యాప్ ఎంటర్ చేయడానికి కార్యదర్శులకు అనేక ఇబ్బందులు తలెత్తుతు న్నాయని.. ఒక్కో రైతుకు సంబంధించి డాటా ఎంటర్ చేయడానికి 5 నిమిషాల సమయం పడుతుందని.. వేతన కార్యదర్శులకు పూర్తి వెసలుబాటు కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాడిరైతుల సంఘం నాయకులు రామకృష్ణ, నాయకులు సుధాకర్ యాదవ్, జితేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాస్, రంగా, లక్ష్మణ్, చంద్రయ్య, నారాయణ రెడ్డి, ఘాంస్యనాయక్, ప్రభాకర్‌రెడ్డి, రాజు, కృష్ణయ్య, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

నిరుపేదలకు 'ఉప్పల' చేయూత

తలకొండపల్లి: నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, మిషన్ భగీరథ కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆర్థిక సహాయం అందజేశారు. మండల పరిధిలోని రాంపూర్‌కు చెందిన అక్షయ చదువుకు ఆర్థిక సహాయం అందజేస్తానని ఇటీవల ఉప్పల తెలిపారు. బుధవారం ట్రస్టు సభ్యులచే హైదరాబాద్‌లో రూ.10,000 అక్షయకు అందజేశారు. అదేవిధంగా నీట్‌లో సీటు సాధించి కళాశాల ఫీజులు కట్టలేక మథన పడుతున్న మరో నిరుపేద విద్యార్థికి రూ.15,000 అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, ఉప సర్పంచ్ మోహన్‌రెడ్డి, ఆర్మీ అకాడమీ డైరెక్టర్ నందు, బుచ్చిబాబు, మల్లేశ్, నర్సింహ, జానయ్య తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ ఎస్సీసెల్ చైర్మన్‌గా చెన్నకేశవులు


చెన్నకేశవులుకు నియామకపత్రం అందజేస్తున్న వంశీచంద్‌రెడ్డి

తలకొండపల్లి: కాంగ్రెస్ మండల ఎస్సీసెల్ చైర్మన్‌గా మండల పరిధిలోని చీపునుంతలకు చెందిన మిడత చెన్నకేశవులును నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్లూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి కడ్తాల్‌లో చెన్నకేశవులకు బుధవారం నియామకపత్రం అందజేశారు. వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ బలోపేతానికి చెన్నకేశవులు ఎంతో కృషిచేశాడాని పేర్కొన్నారు. కష్ట కాలంలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి అంకిత భావంతో పనిచేశాడని గుర్తుచేశారు. ఆయన సేవలను గుర్తింపుగా జిల్లా ఎస్సీసెల్ చైర్మన్ రాజ్‌కుమార్ ఆదేశానుసారం మండల ఎస్సీసెల్ చైర్మన్‌గా నియమించినట్లు తెలిపారు. చెన్నకేశవులు మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి పదవి కట్టబెట్టిన వంశీచంద్‌రెడ్డి, జిల్లా ఎస్సీ చైర్మన్ రాజ్‌కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భగ్వాన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అంజయ్యగుప్తా, కడ్తాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిచ్యానాయక్, సోషల్ మీడియా అసెంబ్లీ ఇన్‌చార్జి అజీం, యూత్ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, రమేష్, ఆరీఫ్, ఇక్బాల్ పాల్గొన్నారు.